క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరిశీలన



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నూతన ఎమ్మెల్యే విజయుడు ఆదివారం పరిశీలించారు. ఈ నెల 9వ తేదీన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం విధితమే. అలంపూర్ మున్సిపాలిటీలో పలు ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరువుతున్న క్రమంలో అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. క్యాంపు కార్యాలయంలో ఉన్న ఫరీ్నచర్, ఇతర సామగ్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు త్వరలో క్యాంపు కార్యాలయంలోకి మకాం మార్చనున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఎంపీపీ అశోక్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రఘురెడ్డి, రవి, నీలప్ప, కొండన్న ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: ఈ నెల 11వ తేదిన విద్యుత్ అంతరాయం ఉంటుందని అలంపూర్ సబ్ డిజన్ టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఏడీఈ సయ్యద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని 132/33 కేవీ సబ్ స్టేషన్ లో సోమవారం ఉదయం 10గంటల నుంచి 12:30 గంటల వరకు మరమ్మతులో భాగంగా బ్యాటరీలు మార్చడానికి 33 కేవీ బస్–బార్ మొత్తం లైన్ క్లియరెన్స్‌తో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో 33 కేవీపీ అలంపూర్ చౌరస్తా, ఉండవెల్లి, అలంపూర్ పట్టణం, శాంతినగర్–1, శాంతినగర్–2 ఫీడర్లలో సైతం అత్యవసర మరమ్మతు పనులు చేపడుతుండటంతో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. 132/33 కేవీ, 33 కేవీ సబ్ స్టేషన్‌లలో ఏక కాలంలో మరమ్మతు పనులు జరగనుండటంతో ఈ సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఉప కేంద్రాలైన అలంపూర్, భీమవరం, ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తా, మానవపాడు, శ్రీనగర్, జల్లాపురం, శాంతినగర్, రామాపురం, పెద్ద తాండ్రపాడు, రాజోలి, చాగాపురం, శాసనూల్, ఆర్.గార్లపాడు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, రైతు సంఘాలు, వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కిందపడి వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. కర్నూల్ జిల్లాలోని ఎమ్మిగనూర్ పట్టణానికి చెందిన ఆకుతోట మహేష్ (36) కొంత కాలంగా కుటుంబంలో సమస్యల రావడంతో వారికి దూరంగా ఎర్రవల్లిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఓ షాపు ముందు ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని గద్వాల మార్చూరికి తరలించారు. అతని తల్లి ఆకుతోట కుళాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లీకేజీని అరికట్టాలి

గట్టు: మండల కేంద్రంలో తాగు నీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్లకు అక్కడక్కడ లీకేజీ కారణంగా తాగు నీరు వృథాగా రోడ్లపై పారుతుండడంతో ఇబ్బందికరంగా మారింది. బండమీది గేరి, సంత బజారుకు వెళ్లే చోట పైపులైన్ లీకేజీ కావడంతో రోడ్లపై నీరు వృథాగా పారుతోంది. లీకేజీ కారణంగా మురుగు నీరు మళ్లీ పైపుల్లోకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ పాలకులు స్పందించి తాగు నీటి పైపులైన్ లీకేజీలను సరి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చండి



అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పెద్ద వాగుపై పాత వంతెన తొలంగించి, నూతన వంతెన నిర్మిస్తుండడంతో అంబేద్కర్ చౌక్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రతిరోజు అధిక సంఖ్యలో వాహనాలు అంబేద్కర్ చౌక్ మీదుగా పశువుల దవాఖాన ముందు వెళ్తున్నాయి. రోడ్డు మార్గం చిన్నగా ఉండడంతో ప్రతి రోజు ట్రాఫిక్ జాం అవుతోంది. దాని వల్ల అత్యవసర సేవలందించే 108, అంబులెన్స్ వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా ట్రాఫిక్ జాం అవుతోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెద్ద వాహనాలను తిక్కవీరేశ్వర స్వామి వెనుక ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రోడ్డుపై వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు

- ఇరుకు గదుల్లో విధుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కేటీదొడ్డి ఎంపీడీఓ కార్యాలయం



అద్దె భవనంలో కొనసాగుతున్న మహిళా సమాఖ్య కార్యాలయం

కేటీదొడ్డి: పాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటీదొడ్డి మండలాన్ని ఏర్పాటు చేసింది. మొత్తం 23 పంచాయతీలున్నాయి. ఉమ్మడి మండలం నుంచి కేటీదొడ్డి మండలాన్ని ఏర్పాటు చేసి ఏడేళ్లు అవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. కొన్ని కార్యాలయాలు అద్దెభవనాల్లో మరి కొన్ని ఇరుకుగదుల్లో నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాలు, మహిళా సమాఖ్య భవనం, పోలీస్ స్టేషన్ కార్యాలయాలు ఇరుకుగదుల్లో కొనసాగుతున్నాయి. ఏదైనా సమావేశం నిర్వహించాలన్న ఇబ్బందిగా మారుతోంది. కనీసం ఐదు కుర్చీలు పెట్టే పరిస్థితి కూడా లేదు. పోలీస్‌స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతోంది. పోలీసు సిబ్బందికి గృహాలు లేవు. మండలంలో ఎంఈఓ లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంఈఓ ఉండటంతో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం లేదు.

సమస్యలు తీరలె..

ధరూర్, గట్టు ఉమ్మడి మండలంలోని కేటీదొడ్డి కొత్త మండలాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషించారు. కానీ గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. మండలంలో అభివృద్ధి పనులు చేయడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుని నూతన భవనాలు మంజూరు చేయాలని, త్వరగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



మండల వనరుల భవనంలో తహసీల్దార్ కార్యాలయం

నూతన భవనాలు నిర్మించాలి



కేటీదొడ్డి మండలంలో ఎలాంటి నూతన కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి, అధికారులు మీటింగ్‌లు పెట్టాలంటే ఆరుబయటే ఏర్పాటు చేస్తున్నారు. నూతన భవనాలు నిర్మించాలి.

– వీరన్న, కేటీదొడ్డి

చర్యలు తీసుకోవాలి..



కేటీదొడ్డి మండలంలో కార్యాలయాల సమస్యలు పరిష్కారించాలి. కొత్త భవనాలు నిర్మించి కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. మండలాన్ని అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కర్రెన్న, కేటీదొడ్డి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

మండలంలో నూతన భవనా లతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ దృష్టి తీసుకెళ్తాం. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటాం. అందరి భాగస్వామ్యంతో మండలాన్ని అభివృద్ధి చేస్తాం.

– మనోరమ, ఎంపీపీ, కేటీదొడ్డి

‘మహాలక్ష్మి’తో మహిళలకు చేయూత



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: మహాలక్ష్మి పథకం మహిళలకు చేయూత కలగనుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం ప్రవేశపెట్టి మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం బస్సును ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన ఎమ్మెల్యే విజయుడు ఆర్టీసీ డీఎం మంజుల, జిల్లా వైద్య అధికారిణి శశికళ, సీఈఓ ముషాయిదా బేగం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమలతో కలిసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఉచిత టికెట్‌ను అందజేశారు. బస్సులో ఎక్కిన విద్యార్థినీలతో కలిసి ప్రయాణం చేశారు.

ప్రతి ఒక్కరికి కృతజ్ఞుడిని..

విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞుడిని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరుకాగా ఘనస్వాగతం పలికారు. వడ్డేపల్లి, రాజోలి మండలాల సీఆర్‌పీఎఫ్, ఎంఈఎఫ్ ఫౌండేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసినట్లు తెలిపారు.

యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలి



ధరూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సీపీ ప్రసాద్

ధరూరు: యువత చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో నడవాలని పాస్టర్ రెవ సీపీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏబీ షాలేం చర్చిలో క్రిస్మస్ సందర్భంగా యూత్ క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న పరిణామాల నేపథ్యంలో పెడదోవ పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఏసు క్రీస్తు ప్రభుతల వారు యవ్వన కాలమందే నా కాడి మోయుమని బోధించారన్నారు. చేసిన తప్పులను క్షమించు వాడు ఏసయ్యేనన్నారు. అనంతరం యూత్‌తో పాటు సంఘ పెద్దలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల కమిటీ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల కోసం కృషిచేస్తాం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

శాంతినగర్: మదాసి, మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు కోసం నిరంతరం కృషిచేస్తామని అలంపూర్ నియోజకవర్గ మదాసి, మదారి కురువ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పల్లయ్యలు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ కమిటీ హాల్లో నియోజకవర్గ స్థాయి మదాసి, మదారి కురువల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా రాజోళి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సంకాపురం పల్లయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పల్లయ్య మాట్లాడుతూ కులసమస్యలు ఏమున్నా అందరం కలిసి కట్టుగా పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, గౌరవ అధ్యక్షులు పెద్దసోమన్న, నాయకులు ఠాగూర్ కృష్ణ, దేవర జయన్న, పీకే రామాంజనేయులు, రంగన్న, కుల పెద్దలు, ఆయా మండలాలకు చెందిన మదాసి, మ దారి కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో యువకుల పాదయాత్ర



ఎర్రవల్లిచౌరస్తా: కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నాగరాజు, రఘుపతి అనే ఇద్దరు యువకులు తమ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎంపికవ్వడంతో కొడంగల్ నుంచి తిరుపతికి పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా వారు చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రానికి చేరడంతో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో మండల నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారికి పూల మాలలు వేసి శాలువాతో సత్కరించి పండ్లు, తాగు నీటి బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, రాంప్రసాద్, శివ ఉన్నారు.

శిథిలావస్థలో జూరాల కుడి కాల్వ



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద కాల్వ కుడి వైపున లైనింగ్ కుంగిపోయి ప్రమాదకరంగా ఏర్పడింది. ఆ దారిలో రేవులపల్లి గ్రామస్తులు, విద్యార్థులు నిత్యం వెళ్లి వస్తుంటారు. ఏ మాత్రం ఆదమరిచినా, ప్రమాదం జరగడం కాయంగా కనిపిస్తోంది. పలు మార్లు పత్రికల్లో వార్తా కథనాలు వస్తున్నా పీజేపీ అధికారుల్లో మాత్రం చలనం రావడంలేదు. ఏళ్ల తరబడిగా ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. త్వరలోనే రబీ పంట సీజన్ ప్రారంభంకనున్న తరుణంగా అధిక మొత్తంలో నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో కాల్వ వెంట మట్టి కుంగిపోతుందని రేవులపల్లి గ్రామస్తులు తెలిపారు.

హామీల అమలుపై హర్షం



జెడ్పీచైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళలు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మీ పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వైద్య సేవలను అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండలంలోని నీలిపల్లికి చెందిన మహిళలు జెడ్పీచైర్‌పర్సన్ సరితను కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత ప్రయాణంపై డ్రైవర్, కండక్టర్లకు సన్మానం



ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లను సన్మానించిన నాయకులు

గట్టు: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసిన నేపథ్యంలో ఆదివారం గట్టులో కాంగ్రెస్ నాయకులు సంబరాలను నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో గద్వాల ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను కాంగ్రెస్ నాయకులు పూల మాలలతో సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రాము, కాంగ్రెస్ నాయకులు పిల్లి నర్సింహులు, గోవిందు, వార్ల రాజు, వడ్డే భీమేష్, మీసాల నరేష్, నర్సింహులు, ముని పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం



భద్రకాళి వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

గద్వాల అర్బన్: వీరశైవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తీక బహుళ త్రయోదశి నాడు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం దశాబ్దలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆయలం వద్ద ధ్వజారోహణ నిర్వహించి, స్వామివారికి క్రిష్ణానది జలాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, హోమం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను జిల్లా కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగిస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవుల ప్రత్యేకంగా నందికోల సేవ కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం, వీరశైవ మహిళా సంఘాలు, వీరశైవ యువజన సేవా సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కులబంధువులు, భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాల్లో మహిళలు కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాలకు చేరుకుని అభిషేకాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలిగించారు. పవిత్రమాసంగా భావించే ఈ మాసంలో శివుడిని ఆరాధించడంతో ఎంతో మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. భక్తులు అధికసంఖ్యలో కార్తీకపూజల్లో పాల్గొంటున్నట్లు అర్చకులు రమేషాచారి, రవిచారిలతో పాటు ధర్మేంద్ర, విజయ్, పరమేశ్వరాచారిలు తెలిపారు.

అమరవాయిలో అఖండ భజన



అఖండ భజనలో పాల్గొన్న బృందం

మల్దకల్: మండలంలోని అమరవాయిలో కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం అఖండ భజన కార్యక్రమాన్ని భజన మండలి సభ్యులు నిర్వహించారు. శనివారం నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు ఈ అఖండ భజన నిర్వహిస్తున్నట్లు భజన మండలి నిర్వాహకులు పాండురంగ స్వామి తెలిపారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో భజన మండలి సభ్యులు అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, భజన మండలి సభ్యులు పాండురంగారెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, కృష్ణమూర్తి, వెంకట్రాములు, విజయ్, లక్ష్మీనారాయణ, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ముళ్ల పొదలను తొలగించండి



పెద్దవాగులో దట్టమైన ముళ్ల పొదలు

అయిజ: పట్టణంలోని పెద్దవాగులో కొన్ని సంవత్సరాలుగా ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. వర్షాకాలంలో వాగులో వరద వస్తే వాగు చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఇటీవల వాగుకు ఒక పక్కన కొంతమేర ముళ్లపొదలను తొలగించి వదిలేశారు. రెండో వైపున ముళ్ల పొదలు అదేవిధంగానే ఉన్నాయి. వాగుకు రెండు పక్కల ముళ్ల పొదలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వాగులో చెత్తను వేస్తుండడంతో ఆ ప్రదేశం మురికి కూపంగా మారింది. దారిలో వెళ్లే వారికి దుర్వాసన వెదజల్లుతుండడంతో అటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గోదాంల నిర్మాణమయ్యేనా?

- మండల కేంద్రంలో శిథిలమైన సివిల్ సప్లయి గోదాం
- 2 మున్సిపాలిటీలకు, 5 మండలాలకు ఒక్కటే గోదాం
- బియ్యం సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులు



చౌకధర బియ్యం నిల్వ చేస్తున్న అద్దె గోదాం

అయిజ: ప్రభుత్వం పేద ప్రజలకు చౌకధర దుకాణాల ద్వారా బియ్యం అందిస్తోంది. బియ్యం సంచులు నిలువ చేసేందుకు పౌరసరఫరాల శాఖకు సంబంధించిన గోదాంలు మండలానికి ఒకటి చొప్పున లేకపోవడంతో లబ్ధిదారులకు చేరవేసేందుకు కాలాతీతం అవుతున్నది. అయిజ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డుకు సంబంధించిన గోదాంను సివిల్ సప్లై అధికారులు అద్దెకు తీసుకొని కొన్ని సంవత్సరాల నుంచి ఆ గోదాంలోనే సరుకులు నిల్వ చేస్తున్నారు. దీనికోసం ప్రతినెల రూ. 5,000 అద్దె చెల్లిస్తున్నారు. అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలతో పాటు అయిజ, వడ్డేపల్లి, రాజోళి, మల్దకల్, గట్టు మండలాల్లోని వివిధ గ్రామాల చౌకధర దుకాణాలకు సరఫరా చేయాల్సిన సివిల్ సప్లై బియ్యాన్ని అయిజ మండల కేంద్రంలోని గోదాంలో నిలువ చేసుకోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతినెల గోదాంకు సుమారు 8 లక్షల క్వింటాళ్ల బియ్యం వస్తోంది. నిల్వ చేసుకోవడానికి గోదాంలో స్థలం చాలక పోవడంతో 4 నుంచి 5 విడతలుగా నిల్వ చేస్తున్నారు. వచ్చిన బియ్యం బస్తాలను వచ్చినట్లే చౌకధర దుకాణాలకు తరలించి, మిగిలిన బియ్యం బస్తాలను అనేక దఫాలుగా గోదాంలో దింపుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నా యి. చౌకధర దుకాణాల నిర్వాహకులకు స రైన సమయంలో బియ్యం బస్తాలు చేరకపోవడంతో వినియోగదారులకు సరైన సమయంలో సరుకులు అందడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి మండలానికి ఒక్కటి చొప్పున గోదాంలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

కొత్త గోదాం నిర్మించాలి..



అయిజలో నిర్వహిస్తున్న గోదాం శిథిలమైంది. దాని స్థానంలో కొత్త గోదాం నిర్మించాలి. ఇప్పుడున్న గోదాం చిన్నగా ఉండడంతో లారీల్లో తెచ్చిన బియ్యం బస్తాలు నిల్వ చేసేందుకు వీలు కావడంలేదు. గోదాంలో నిల్వ చేసిన బియ్యం బస్తాలు తరలిస్తే గాని నిల్వ చేసుకునేందుకు వీలు లేదు. విశాలంగా నూతన గోదాంను నిర్మిస్తే బాగుంటుంది.

– రాంబాబు, అయిజ

ఒకే గోదాం ఉండడం వల్ల సమస్యలు..



రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు కలిపి అయిజలో ఒకటే గోదాం ఉంది. అదికూడా శిథిలమైంది. ఒక్కటే గోదాం ఉన్నందువల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చౌకధర దుకాణాలకు సరైన సమయంలో సరుకులు దింపడంలేదు. దాని వల్ల వినియోగదారులకు బియ్యం ఆలస్యంగా పంపిణీ చేస్తున్నారు. మండలానికి ఒక గోదాం నిర్మిస్తే బాగుంటుంది.

– సోమశేఖర్, గుడుదొడ్డి

నివేదికలు పంపాం..



ఒక్కటే గోదాం ఉండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో బియ్యం బస్తాలు నిల్వ చేసుకోవడానికి ఇబ్బంది కలుగుతోంది. ఉన్న ఒక్క గోదాం కూడా శిథిలమైంది. అదనంగా గోదాంలు నిర్మించాలని గతంలోని అధికారులు అనేకసార్లు నివేదికలు పంపించాం. నిధులు మంజూరైతే నూతన గోదాంలు నిర్మించేందుకు కృషి చేస్తాం.

– షహిదాబేగం, తహసీల్దార్, అయిజ